# భూమి, అడవి, అటవీ సంపదలపై సర్వహక్కులు గిరిజనులవేనంటూ సుదీర్ఘకాలం సాగిన కొండమొదలు భూపోరాటం

**గిరిజనులు** భూమి కోసం, అడవి, అటవీ సంపదపై సర్వహక్కులు గిరిజనులవేనని సుదీర్ఘకాలం పాటు సాగించి పాక్షిక విజయాలు పొందిన పోరాటం - కొండమొదలు భూపోరాటం. ఈ పోరాటం యొక్క క్రమం చాలా ఉన్నతమైనది. భూస్వాములకు, పెత్తందారీ శక్తులకు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా అనేక అరెస్టులను, నిర్బంధాలను, కాల్పులను తట్టుకొని 53 సంవత్సరాల పాటు సాగించిన, సాగుతున్న పోరాటం.

1969 నుండి నేటి వరకు అనేక మలుపులతో ఏజెన్సీ గిరిజన సంఘం నాయకత్వంలో గిరిజన ప్రజానీకం ఈ భూ పోరాటాన్ని ముందుకు తీసుకువెళుతున్నారు. ప్రజలకు నాయకత్వం, నాయకత్వానికి ప్రజలు అన్న విధంగా ప్రజాస్వామిక చర్చల ద్వారా నాటి నుండి నేటి వరకు ప్రజలతో మమేకమై పార్టీ మార్గదర్శకత్వంలో చేసిన నిర్ణయాలను అమలు చేస్తూనే ఉన్నారు. 1982లో కుంజం రాజులు, మడిం లక్ష్మయ్యల బలిదానంతో కొండమొదలు గిరిజనోద్యమం ముఖ్యమైన మలుపు తీసుకున్నప్పుడు, సంయమనంతో వ్యవహరించి విజయాన్ని నిలబెట్టుకొన్నారు. ఇక్కడ బాధ్యత వహించిన అనేక మంది కామ్రేడ్స్ అందించిన స్ఫూర్తిని కొనసాగిస్తున్నారు. అమరుల త్యాగాలను గుర్తు చేసుకుంటూనే ఉన్నారు.

2004 నాటికి ఉభయగోదావరి జిల్లాలు ఆనాడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌గా ఉన్న ఖమ్మం జిల్లాలోని చింతూరు, భద్రాచలం, తదితర ప్రాంతాలలో ఆదివాసీ సమస్యలు, ముఖ్యంగా భూమి సమస్యపై ఏజెన్సీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో ప్రభావవంతమైన కృషి జరుగుతూ వచ్చింది.

సరిగ్గా ఆదివాసుల భూమి హక్కు సమస్య బలంగా ముందుకు వస్తున్న ఆ సమయంలో పోలవరం ప్రాజెక్టు నిర్మాణం తెరపైకి వచ్చింది. దానితో ప్రజా పోరాటంలో ఉన్న పోరాట శక్తుల బలాబలాల్లో మార్పులు వచ్చాయి. అంతవరకు ఒక్క భూస్వాములతోనే ప్రధానంగా పోరాటం ఉండేది. ప్రభుత్వం భూస్వాముల కొమ్ముకాయాలని ఎంత ప్రయత్నించినా తను చేసిన చట్టాలే తనకు ఆటంకంగా ప్రజల చేత మార్చబడ్డాయి. ప్రాజెక్టును సాకుగా చూపి అభివృద్ధికి-ఆదివాసులకు మధ్య పోటీ పెట్టి, 2009 నాటికి ప్రాజెక్టు నిర్మాణం పూర్తవుతుందనే ప్రభుత్వ ప్రచార హోరును ఉధృతంగా సాగించింది. నేటికీ పాలకవర్గ పార్టీలు ఈ ప్రచార హోరును ఆపలేదు. మొత్తం భూస్వామ్య శక్తులన్నీ ప్రాజెక్టు కాంట్రాక్టర్లను (రాజకీయ నాయకులే) ప్రజా వ్యతిరేకులను ఒక తాటిమీదకు తీసుకువచ్చి గిరిజన గ్రామ పెత్తందార్లను డబ్బుతో మభ్యపెట్టి లొంగ దీసుకోవాలని చూసారు.

పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి ప్రభుత్వం పూనుకుంది అని తెలిసి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాలు మీదుగా ఖమ్మం జిల్లాలలో ప్రజలకు మరీ ముఖ్యంగా ఆదివాసీ ప్రజానీకానికి ఆందోళన కలిగించింది. అంతకు ముందున్న జలయజ్ఞం పేరుతో కొవ్వాడ (పశ్చిమ గోదావరి), సూరంపాలెం (తూర్పుగోదావరి) ప్రాజెక్టుల నిర్వాసితుల పరిస్థితి ఒక్కసారిగా కళ్ళ ముందు మెదలడంతో ఆనాడు ప్రజల్లో తీవ్ర నిరాశా నిస్పృహలు ఆవహించాయి. గ్రామాలు గ్రామాలు పంటలు పండించక, ఇళ్ళ మరమత్తుల వంటి పనులు కూడా ఏవీ జరగకుండా నిర్జీవంగా ఉన్న వాతావరణంలో ఉద్యమ నాయకత్వం ప్రజలకు శాస్త్రీయంగా పరిస్థితిని వివరిస్తూ, 2020 నాటికి కూడా ప్రాజెక్టు పూర్తి కాదని సంఘం, సంఘం నాయకత్వం ప్రతి మలుపులోను తమ పోరాటాన్ని నిలుపు కుంటూనే పునరావాస సమస్యలపై ప్రజలను సమీకరించిన తీరును గమనించవచ్చును.

భూమి భూపోరాటం కేంద్రంగా అంతర్జాతీయ ప్రమాణాలతో శాస్త్రీయ, సమగ్ర పునరావాసం సాధన అన్న ఎజెండాతో ఏజెన్సీ గిరిజన సంఘం మడమ తప్పకుండా 'ముందు పునరావాసం, తరువాతే నిర్మాణం' అన్న స్పష్టమైన వైఖరితో నాటి నుండి ఈనాటికి కార్యక్రమాలు సాగిస్తున్నది.

ఇతర విప్లవ గ్రూపులతో భిన్నాభిప్రాయాలు, వివాదాలు ఉన్నప్పటికీ వాటిని ఎన్నడూ వివాద స్పదం చేయడానికి గాని, బహిరంగ ప్రచారం చేసే పద్ధతిని గాని ఎప్పుడు ఎంచుకోకుండా ప్రజలకు నిరంతరం అవగాహన కల్పిస్తూ, మధ్యవర్తులకు, ప్రజాతంత్రవాదులకు వాస్తవాలు వెల్లడి చేస్తూనే వ్యతిరేక ప్రచారాలను తిప్పికొడుతూ వచ్చింది. భౌతికదాడులకు దారితీసిన సందర్భాలలో ప్రజల సహకారంతో వ్యవహరించిన తీరు ఎంతో ప్రభావవంతమైనది. ముఖ్యంగా వామపక్ష, ఇతర విప్లవ గ్రూపులతో ఐక్యంగా పోరాడే వైఖరిని కూడా అనుసరించారు.

ఏజెన్సీ గిరిజన సంఘ నాయకత్వం (రైతు కూలీ సంఘం (ఆం.ప్ర) అనుబంధం) 2004 నుండి 'ముందు సమగ్ర పునరావాసం, తరువాతే ప్రాజెక్టు నిర్మాణం' అన్న విషయంపైనే ఆందోళనను కేంద్రీకరించింది. ప్రభుత్వాలు మాత్రం ప్రాజెక్టు నిర్మాణం, పునరావాసం ఏకకాలంలో జరుగుతాయని చెప్పాయి. అంతా హుళక్కి.

ఇన్నేళ్ళుగా ప్రజలు చేసే ఆందోళనలు న్యాయమైనవని తెలిసింది. దాదాపు దశాబ్దన్నర పైగా నిర్మాణం జరుగుతున్న ప్రాజెక్టు సమగ్రమైన పునరావాసం కల్పించకుండా కాసిన్ని

డబ్బులిచ్చి, భూములకు భూములివ్వకుండానే, సరైన పక్కా ఇళ్ల నిర్మాణం జరగకుండానే (పునరావాసం కల్పించకుండానే), స్పిల్‌వే నిర్మించకుండా కాఫర్ డ్యామ్ నిర్మించి గోదావరిలో నీళ్ళు నిలబెట్టి గ్రామాలను ముంచి రవాణా వ్యవస్థను స్తంభింప చేసి ప్రజలను తరలించే ప్రయత్నం చేసారు.

ఇటువంటి స్థితిలో 'గిరిజనులు, గిరిజనేతరులు ఎవరి దారిన వారు పోవటం కాదు. అందరం ఒక్కటై అందరికీ సమగ్ర, సక్రమ పునరావాసం పునర్‌నిర్మాణం సాధించుకుని కదలాలి' అని అమరులు కా॥ చదల వీరపురెడ్డి కన్వీనర్‌గా పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులు పోరాట కమిటీ ద్వారా ప్రజలను సమీకరించారు. ప్రత్యక్షంగా కొండమొదలు భూపోరాటంతో సంబంధం ఉన్న గ్రామాలు మాత్రం అనేక ఆందోళనలు, నిరసనల రూపంలో ఈ పోరాటాన్ని సాగించిన ఫలితంగా ప్రజలు కోరిన దగ్గర కాలనీ ఇళ్ళ నిర్మాణం జరిగింది. గ్రామసభల ద్వారా నిర్మాణం సక్రమంగా జరిగేలా నిరంతరం పర్యవేక్షిస్తూ నిర్మించుకున్నారు.

కాలనీ ప్రారంభోత్సవంలో ప్రభుత్వం చొరబడి ఉద్యమాల ద్వారా సాధించుకున్న మొత్తం ఉద్యమ ఫలాన్ని స్థానిక రాజకీయ నాయకులు కాజేయాలని ప్రభుత్వం, అధికార యంత్రాంగం అండతో పెత్తనం చెలాయించాలని చూశారు. దీనిని గ్రహించిన ప్రజలలో ఆగ్రహం రగిలింది. సంఘం సంయమనంతో వ్యవహరించింది. ఇలాంటి సందర్భాలు రాకుండా వుండవని మనం సాధించుకోవలసింది మునుముందు చాలా ఉందని చెప్పుకుంటూ, ప్రజల చైతన్య స్థాయిని పెంచేలా చాలా ఓర్పుతో వ్యవహరించారు.

పునరావాస కాలనీ ప్రారంభోత్సవ సభలో నాయకత్వం ఇలా పేర్కొంది. 'ఎవరైతే ప్రాజెక్టు వల్ల నష్టపోతారో, వారే ఆ ప్రాజెక్టు వల్ల లాభపడే వారిలో ప్రథమంగా ఉండాలి. ఆర్ అండ్ ఆర్ ద్వారా నష్టపరిహారంగా డబ్బులు విసిరేసి చేతులు దులుపుకోవడం కాకుండా, జీవితాలను గౌరవించే మానవీయ, సామాజిక దృక్పథం కావాల'ని తెలుపుతూ, 'మరీ ముఖ్యంగా మనం ఎవరిమైనా, ఎంత గొప్పవారమైనా కన్నతల్లిని, జన్మభూమిని సొంత ఊరుని మర్చిపోకూడదని పెద్దలంంటారు. కానీ ఈ పోలవరం ప్రాజెక్టు వలన నిర్వాసితులైన వారు సరిగ్గా అటువంటి అనుబంధాలన్నిటినీ, వాతావరణాన్నీ పూర్తిగా కోల్పోతున్నారు. దేశ ప్రజలందరి కోసం వాళ్ళు చేస్తున్న త్యాగాలకు వెలకట్టలేము. కావున వాళ్ళకు ఆత్మగౌరవంతో కూడిన పునరావాసం కల్పించడం ప్రభుత్వాల పని. కనుక అర్హత కలిగిన ప్రజలందరికి శాస్త్రీయ, సమగ్ర పునరావాసం కల్పించాల'ని అధికారులకు ఉద్వేగపూరింగా విజ్ఞప్తి చేశారు.

**– ఒక విలేఖరి**

*****